సచివాలయ వ్యవస్థకు తూట్లు

● రెండు సచివాలయాలు ఒకటిగా విలీనం
● ప్రజలకు దూరం కానున్న సేవలు

బలిజిపేట:

మారుమూల గ్రామాల్లో ఉండే ప్రజలకు అన్ని సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గత ప్రభుత్వం గ్రామ స్వరాజ్య సాధన దిశగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో గ్రామాల్లో 530 రకాల సేవలు అందుతుండేవి. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వ్యయప్రయాసలకు లోనుకాకుండా సేవలు అందుబాటులోకి వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల పల్లె ముంగిట ప్రభుత్వ సేవలు దూరం కానున్నాయి. ఇకపై రెండు సచివాలయాలను కలిపి ఒక సచివాలయంగా ఏర్పాటుచేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఎంపీడీఓలు, కార్యదర్శులు సచివాలయాల కుదింపు ఎలా చేయాలనే దానిపై విస్తృతంగా చర్చలు చేపట్టారు. రెండు సచివాలయాలు ఉన్నచోట ఒకటి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల ఒక గ్రామంలోని సచివాలయాన్ని సమీపంలోని మరో సచివాలయానికి అనుసంధానం చేయనున్నారు. కొన్నిచోట్ల మాత్రం సచివాలయాలు లేకుండా చేస్తే ప్రజలు సుదూరంగా వెళ్లాల్సి వస్తుంది. అలాంటి వాటిని ఎలా చేయాలనే దానిపై అధికారులు ఆలోచిస్తున్నారు.

ఉద్యోగుల సంఖ్య తగ్గనుంది

సచివాలయాల్లో 11మంది ఉద్యోగులు ఉన్నచోట వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి కుదించే చర్యలు జరుగుతున్నాయి. వెల్ఫేర్ అసిస్టెంట్, వీఆర్వో, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయం, వెటర్నరీ, ఏఎన్ఎం, మహిళాపోలీసు తదితరులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగుల్లో ప్రధానంగా వెల్ఫేర్, వీఆర్వో, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌తో మొత్తం తొమ్మిది మంది మాత్రమే పనిచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిగిలిన ఉద్యోగులను ఆయా శాఖలకు బదలాయింపు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.


బలిజిపేట సచివాలయం

ప్రజలకు తప్పని తిప్పలు

సచివాలయాలను విలీనం చేయనుండడంతో వివిధ రకాల సేవల కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్న ఊరిలోనే సేవలు పొందే గ్రామస్తులు ఇకపై వేరే ఊర్లకు వెళ్లాల్సిన పరిస్థితులు త్వరలో ఏర్పడను న్నాయి. కనీసం నాలుగైదు కిలోమీటర్లు పైబడి దూరం ప్రయాణించాల్సి వస్తుందేమోననే ఆందోళన ప్రజల్లో మొదలైంది. పనులు మానుకుని సచివాలయాలకు వెళ్లినా అక్కడ సిబ్బంది ఉంటారా? లేక ఫీల్డ్ విజిట్‌కు వెళ్లిపోయి ఉంటారా? అనేది తెలియని పరిస్థితి ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉన్న ఊరిలో పనులు చేసుకుని ఖాళీ సమయం చూసుకుని సచివాలయం వద్దకు వెళ్లి పనులు చేసుకునే వారమని, ఒకవేళ వృద్ధులు వారి పనుల నిమిత్తం వెళ్లాల్సి వచ్చినా ఇబ్బంది పడకుండా గ్రామంలో ఉండే సచివాలయం వద్దకు వెళ్లి పనులు చేసుకుండేవారని, ఇప్పుడు సచివాలయాల కుదింపుతో ఎటువంటి సమస్యలు వస్తాయో తెలియరావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బలిజిపేట మండలంలో..

మండలంలో 20 సచివాలయాలు ఉన్నాయి. వాటిని 10 క్లస్టర్లుగా సర్దుబాటు చేసే విధంగా కసరత్తు చేస్తున్నారు. దానికి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించారు.

ప్రభుత్వ సూచనల మేరకు

ప్రభుత్వ సూచనల మేరకు బలిజిపేట మండలంలోని 20సచివాలయాలను 10 క్లస్టర్లుగా ప్రతిపాదిస్తూ నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాం.
ఏపీఎస్ నగేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, బలిజిపేట

క్లుప్తంగా

నీలావడి యాత్రకు ప్రత్యేక బస్సులు


నీలావడి యాత్రకు బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం, సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో గల నీలావడి అగ్నిగంగమ్మ యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డిపోమేనేజర్ కనకదుర్గ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఆమె బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా మంగళవారం నుంచి ఒక ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈనెల 16నుంచి 19వ తేదీ వరకు జాతర ఉన్నందున ప్రతి రోజూ 10 బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని తెలిపారు. పార్వతీపురం డిపో నుంచి ప్రతి 30 నిమిషాలకు బస్సు సర్వీసులు ఉంటాయని, ఒక్కో టికెట్ రూ.60 ఉంటుందని తెలిపారు. భక్తులంతా ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

పీ-4సర్వేను వేగవంతం చేయాలి

● డ్వామా పీడీ రామచంద్రరావు


చిలకలపల్లి సచివాలయంలో అధికారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

బలిజిపేట: పీ–4సర్వేను వేగవంతం చేయాలని, చిలకలపల్లిలో ఫారం పాండ్‌లు వెంటనే ప్రారంభించాలని డ్వామా పీడీ రామచంద్రరావు సిబ్బందిని హెచ్చరించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని చిలకలపల్లిలో సర్వేను ఆయన మంగళవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించే సమయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇంటివద్ద వారు లేకపోతే ఆ తరువాత ఇంటికి వెళ్లి వారి కుటుంబ వివరాలు భర్తీ చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో మూడు ఫారంపాండ్‌లు ఇంకా ప్రారంభించకపోవడంపై ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహించారు. త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్, ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఏడవ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. మంగళవారం తెల్లవారు జాము నుంచే సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు చదురుగుడి, వనంగుడికి చేరుకోవడంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. చదురుగుడి ఆలయంవద్ద క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఈవో వీవీసూర్యనారాయణ, ఎస్సై ఎం.వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు దగ్గరుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు శంబర పోలమాంబ అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడిని ఈవో వీవీ సూర్యనారాయణ సాదరంగా స్వాగతించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి


క్రాష్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. ఈ మేరకు సమ్మర్‌క్రాష్ ప్రోగ్రాంను మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 45 రోజులు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారన్నారు. ఎక్కడైనా బోర్లు మరమ్మతులకు గురైతే బాగుచేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పాత్రో, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు నిందితుల తరలింపు

పార్వతీపురం రూరల్: పట్టణంలో ఈనెల 7న దేవాంగుల వీధి కూడలి వద్ద రాగోలు దుర్గ అనే యువకుడిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని పార్వతీపురం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరిచినట్లు పట్టణ సీఐ కె. మురళీధర్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు కోర్టు ఐదుగురు నిందితులకు రిమాండ్‌కు విధించినట్లు చెప్పారు.

వైద్యశాఖలో ఆమె సేవలు మరువలేనివి


పీహెచ్ఎస్‌ను సన్మానిస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి, సిబ్బంది

బలిజిపేట: వైద్యశాఖలో ఏఎన్ఎంగా ఉద్యోగంలో చేరి మంచి సేవలు అందించి పీహెచ్ఎస్‌గా పదోన్నతి పొంది వలంటీర్ రిటైర్‌మెంట్ తీసుకున్న చంద్రావతి సేవలు మరువలేనివని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ప్రశంసించారు. ఫిబ్రవరి 28వ తేదీన వలంటీర్ రిటైర్మెంట్ తీసుకుని ఉద్యోగ విరమణ చేసిన చంద్రావతి దంపతులను బలిజిపేట పీహెచ్‌సీలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి మాట్లాడుతూ ఏఎన్ఎంగా ఉద్యోగంలో చేరిన తరువాత హెచ్‌వీగా పదోన్నతి పొంది ఆ తరువాత పీహెచ్ఎస్‌గా పదోన్నతి పొంది కొంత కాలం సేవలు అందించిన చంద్రావతి వలంటీర్ రిటైర్‌మెంట్ తీసుకున్నట్లు తెలిపారు. వృత్తిలో ఉండే చిన్నవారికి ఆమె సలహాలు ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలి


తాళ్లబురిడిలో మంచినీటి కుళాయిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పార్వతీపురం రూరల్: ప్రజలు అంటురోగాల బారిన పడకుండా సంబంధిత అధికారులు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్టీ నాయకులతో తాళ్లబురిడి గ్రామాన్ని పరిశీలించారు. ఇటీవల గ్రామంలో ప్రబలిన డయేరియా వల్ల ప్రజలు అవస్థలు పడ్డారని సాక్షిలో సోమవారం 'విజృంభించిన డయేరియా '' అన్న కథనానికి స్పందించి సీపీఎం నాయకులు సూరయ్య, బీటీ నాయుడు, మోహన్‌లు గ్రామంలో మంగళవారం పర్యటించి కాలువలను, మంచినీటి పైపులను తనిఖీ చేశారు. గ్రామానికి సరఫరా చేస్తున్న నీరు కలుషితం కావడంతో అంటువ్యాధుల భారిన గ్రామస్తులు పడ్డారని, 3వేలమంది ఓటర్లు ఉన్న గ్రామంలో పారిశుద్ధ్య పనుల్లో లోపం కారణంగా దోమల తీవ్రత, ప్రజలు తినే ఆహారంపై వాటి ప్రభావం తీవ్రంగా పండిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆరోపించారు.

సమష్టి భాగస్వామ్యంతో స్వచ్ఛ సుందర పార్వతీపురం


జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: స్వచ్ఛ సుందర పార్వతీపురంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా బుధవారం ఉదయం కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛతపై అందరినీ చైతన్యపరిచేలా ప్లకార్డులతో కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వరకు ర్యాలీ కొనసాగించాలని తెలిపారు. తదుపరి ఆర్‌సీఎంలో సమావేశం నిర్వహించాలని, ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వచ్ఛంద, ఇతర సంస్థలు భాగస్వామ్యం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీఆర్‌ఓ కె. హేమలత, డీపీఓ కొండలరావు, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డీఎల్డీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువతపోరును విజయవంతం చేయండి


పార్వతీపురం టౌన్: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్లు


సీతానగరం: యువత పోరు పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

● పోస్టర్ ఆవిష్కరించిన పార్వతీపురం పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం జరగనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో గల 30 వార్డుల నుంచి అందరూ పెద్ద సంఖ్యలో యువత పోరు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పార్వతీపురం,


సాలూరు: యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్న వైఎస్సార్‌సీపీ సాలూరు పట్టణ నాయకులు

సాలూరు నియోజకవర్గాల్లోని మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు యువతపోరు పోస్టర్లను ఆవిష్కరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


పార్వతీపురం రూరల్: యువత పోరు పోస్టర్‌ను విడుదల చేసిన పార్వతీపురం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు


పాచిపెంట: యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యువతపోరుకు తరలిరండి

● మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: పట్టణంలో బుధవారం నిర్వహించే యువత పోరు, వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి యువత, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు తరలిరావాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు.ఉదయం 9 గంటలకు పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో అందరు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పార్వతీపురం: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 13న జరగనున్న ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బడే నాగభూషణరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ చేతుల మీదుగా మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగభూషణరావు మాట్లాడుతూ విజయనగరం జిల్లా పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు 13న లయన్స్‌క్లబ్ ఆవరణలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని, కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లైంగిక దాడుల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు

పార్వతీపురంటౌన్: పిల్లలపై లైంగిక దాడులు నిరోధించడానికి సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జీఓ హోంలో మంగళవారం ఓరియేంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలకు మంచి, చెడులు వివరించడం, పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. అటువంటి చర్యలకు పాల్పడిన వారికి చట్టప్రకారం శిక్షలు ఉంటాయన్నారు. బాల్యం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నైతిక విలువలు, మంచి భవిష్యత్‌కు తోడ్పడే సామాజిక అంశాలను వివరించాలని పిలుపునిచ్చారు. అనైతిక చర్యల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని సూచించారు. లైంగిక దాడుల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో కృషిచేసి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో డీఈఐసీ చైల్డ్ సైకాలజిస్టు ఉదయ్‌కుమార్, డీఈఓ ఎస్.తిరుపతినాయుడు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ రఘుకుమార్, సీడీపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు పెరుగుతున్న మద్దతు


మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న ధర్నా

సాలూరు: జీతాలు బకాయిలు లేకుండా ఒకటో తేదీన చెల్లించాలని, తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన మెరుపుసమ్మెకు మద్దతు పెరుగుతోంది. రెండవ రోజు మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో సమ్మె చేస్తున్న కార్మికుల వద్దకు ఎలక్ట్రికల్ వర్కర్లు వచ్చి మద్దతు పలికారు. ఈ సందర్భంగా నాయకులు సంతోష్, అమర్‌కుమార్, శంకర్‌లు మాట్లాడుతూ ఈ సమ్మెకు మున్సిపల్ పాలకవర్గమే బాధ్యత వహించాలని, పాలకవర్గాన్ని సమావేశపరిచి కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, పాలకవర్గం, అధికారులు కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్నాయని విమర్శించారు. చేసిన పనికి జీతాలు ఇవ్వకుండా రోడ్డున పడేస్తే సహించేదిలేదని, ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, పోలరాజు, వెంకట్రావు, వెంకన్న, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వరహాల గెడ్డలో వ్యర్థాల మయం


వరహాలగెడ్డలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తున్న వరహాలగెడ్డకు ఏళ్లనాటి చరిత్ర ఉంది. గత 20ఏళ్లుగా గెడ్డను ఆక్రమిస్తూ కాలువలా మార్చారు. ప్రస్తుతం వరహాలగెడ్డ మరో మూసీనదిని తలపిస్తోంది. చెత్తాచెదారాలు, కూరగాయల మార్కెట్‌లో మిగిలిన వ్యర్థాలు, తాగిపడేసిన సారా ప్యాకెట్లతో వరహాలగెడ్డ కంపుకొడుతోంది. ఈ గెడ్డ ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాలు, ముళ్లపొదలతో దర్శనమిస్తోంది.

మురుగంతా అక్కడే..

పట్టణంలోని వరహాలగెడ్డ చెత్తా చెదారంతో కలుషితమవుతోంది. పట్టణంలోని పలు వార్డుల గుండా మురుగునీరు ప్రవహిస్తుండడంతో ఆయా వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువ నుంచి వచ్చే దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు గెడ్డలో పూడికలు తొలగించకపోవడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. వరహాలగెడ్డ ప్రవహిస్తున్న వార్డుల్లో దోమలు వృద్ధి చెంది వార్డు ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి.

అభివృద్ధి జరిగేది ఇంకెప్పుడు?

పట్టణం గుండా ప్రవహించే వరహాలగెడ్డలోని పూడికలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సంవత్సరానికి రెండుసార్లు తీయించేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్నా పూడిక తీత పనులు చేపట్ట లేదు. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరదనీటితో ఎన్నోసార్లు బైపాస్ కాలనీ జలమయమైన సంఘటనలు చాలానే ఉన్నాయి. పట్టణ వాసులకు విముక్తి కలిగించేందుకు ఆక్రమణలు తొలగించడం, పూడిక తీత పనులను ఎప్పుడు చేస్తారోనని పట్టణ వాసులు నిరీక్షిస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులు నాయుడు


ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులు నాయుడు

సాలూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులు నాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం సాలూరు వచ్చిన ఆయన పట్టణంలోని వేదసమాజం జెడ్పీహెచ్ పాఠశాలలో ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.తన విజయానికి కృషిచేసిన ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా శ్రీనువాసులు నాయుడిని పలువురు ఉపాధ్యాయులు దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు గుణరాజు, నాగేశ్వరరావు, కృష్ణారావు, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం

మక్కువ: మండలంలోని సీబిల్లి పెద్దవలస గ్రామదేవత గంగమ్మతల్లిని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సర్పంచ్ పూడి రమణమ్మ, మాజీ సర్పంచ్ పూడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూడి తిరుపతిరావు, కోటి, గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఘనంగా స్వాగతించారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం


బలిజిపేటలో పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు


యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించిన నాయకులు

● మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతూ వారి జీవితాలను, ఆశయాలను, విద్యావిధానాన్ని కాలరాసి కక్ష సాధింపు చర్యలు చేపట్టడం దారుణమని ఇలా చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే జోగారావు హెచ్చరించారు. నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమంపై బలిజిపేట పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, మెడికల్ కాలేజీల ప్రైవేట్ పరం వంటి విధానాలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టి విద్యార్థుల విద్యాభ్యాసానికి గండి కొడుతోందని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో చిత్తశుద్ధితో విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు రూ.18వేల కోట్ల వరకు ఖర్చుచేశారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 17మెడికల్ కళాశాలలకు ప్రాధాన్యం ఇచ్చి నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని, వాటిలో 5కళాశాలల్లో మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారని, మిగిలినవి ప్రైవేటీకరణకు కూటమి సర్కారు యత్నిస్తోందని, ఇటువంటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

పోస్టర్ విడుదల

యువత పోరు పోస్టర్లను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో బలిజిపేట పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ దాసరికుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి కె.మోహనరావు, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణాల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సాలూరు: పట్టణాల అభివృద్ధికి, జిల్లా అభివృద్ధికి బడ్జెట్‌లో పదివేల కోట్ల రుపాయల నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా ప్రజల సమస్యలపై అధ్యయన యాత్రలో భాగంగా మంగళవారం సీపీఎం ప్రతినిధి బృందం సాలూరులో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి పదివేల కోట్ల రుపాయలు కేటాయించాలని తద్వారానే పట్టణాల్లో ఉన్న ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్వైనాయుడు, ఈశ్వరరావు, భాస్కరరావు, మనోజ్, భారతి తదితరులు పాల్గొన్నారు.